

చీనీ టన్ను రూ.17,500
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.17,500 పలికాయి.



టమాట కిలో రూ.34
కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.34 పలికింది. కనిష్టం రూ.17, సరాసరి రూ.27 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
32.1°/22.4°
జిల్లాలో శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం స్వల్పంగా తగ్గింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి నుంచి తుంపర్ల వర్షం పడింది. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

అయ్యవార్లకు 'ఓటీపీ' తలనొప్పి

- స్టూడెంట్ కిట్లు అందినట్లు ధ్రువీకరణకు తల్లిదండ్రుల మొబైళ్లకు ఓటీపీలు
- ఓటీపీ నంబర్లు చెప్పడానికి నిరాకరిస్తున్న తల్లిదండ్రులు


యాప్‌లో విద్యార్థుల వివరాల నమోదు ఇలా...


అనంతపురం ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం (2025–26)లో పంపిణీ చేసిన సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర (స్టూడెంట్ కిట్ల) కిట్ల నిర్ధారణ కోసం విద్యార్థుల తల్లిదండ్రుల మొబైల్ ఫోన్లకు వచ్చే ఓటీపీలు తీసుకోవడం ఉపాధ్యాయులకు తలనొప్పిగా మారింది. మొన్నటిదాకా బయోమెట్రిక్ విధానంలో తల్లిదండ్రుల నుంచి వేలిముద్రలు తీసుకుని నిర్ధారించుకునేవారు. అయితే తాజాగా ఓటీపీ విధానం తీసుకొచ్చారు. తల్లిదండ్రుల మొబైల్ ఫోన్లకు ఓటీపీ వెళ్తే...సంబంధిత హెచ్‌ఎం, టీచరు ఫోన్ చేసి ఆ ఓటీపీ నంబరు అడిగి యాప్‌లో నమోదు చేస్తే కిట్లు అందినట్లు ధ్రువీకరించనట్టవుతుంది. ఈ విధానం అయ్యవార్లకు తీవ్ర ఇబ్బందులు తెచ్చిపెడుతోంది. జిల్లాలో 1,648 స్కూళ్లల్లో 1–10 తరగతుల విద్యార్థులు 1,98,556 మంది చదువుతున్నారు. వీరందరికీ స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశామని అధికారులు చెబుతున్నా...క్షేత్రస్థాయిలో చాలామంది విద్యార్థులకు కిట్లలోని అన్ని వస్తువులూ నేటికీ అందలేదు. మరీ ముఖ్యంగా చాలా మండలాలకు 'షూ'లు అన్‌సైజ్ వచ్చాయి. అలాగే యూనిఫాం అందలేదు. ప్రతి స్కూల్‌లోనూ స్టూడెంట్ కిట్ల పంపిణీ సమాచారాన్ని 'సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర' యాప్‌లో నమోదు చేయాల్సి ఉంది. ఈ యాప్‌ను హెచ్‌ఎంలు, టీచర్లు అందరూ తమ మొబైళ్లల్లో డౌన్‌లోడ్ చేసుకున్నారు. యాప్‌లో వివరాలన్నీ నమోదు చేసి.. ఓటీపీ సబ్‌మిట్ చేయడానికి 8 – 10 నిమిషాలు పడుతోంది. దీనికితోడు కొందరు త్లితల్లిదండ్రులు తమ మొబైల్ నంబర్లకు వచ్చే ఓటీపీని చెప్పడానికి నిరాకరిస్తుండటం మరింత ఇబ్బందికరంగా మారింది.

దానిమ్మకు వైరస్ వర్రీ


దానిమ్మ పంటను తొలగిస్తున్న రైతు

తాడిపత్రిటౌన్: దానిమ్మ పంటను వైరస్ దెబ్బ తీస్తోంది. యర్రగుంటపల్లిలో రైతు సూర్యనారాయణ ఏడేళ్ల క్రితం ఆరు ఎకరాల్లో దానిమ్మ సాగు చేసారు. ఏటా రూ.10 లక్షల వరకు పెట్టుబడులు పెడుతున్నారు. ప్రస్తుతం అంతంత మాత్రంగానే పంట దిగుబడులు వచ్చాయి. మార్కెట్‌కు తరలించేలోపే దానిమ్మ కాయలకు వైరస్ వ్యాపించింది. దీనికితోడు వర్షాభావ పరిస్థితులతో చెట్లు ఎండుముఖం పట్టాయి. చేసేది లేక రైతు పంటను తొలగించారు. దాదాపు రూ.70 లక్షల దాకా నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయారు.

హుండీలపై తలోమాట


గూగూడు కుళ్లాయిస్వామి దేవాలయం

నార్పల: గూగూడు కుళ్లాయిస్వామి ఆలయంలోని హుండీల సంఖ్యపై గందరగోళం నెలకొంది. అధికారుల విరుద్ధ ప్రకటనలే ఇందుకు కారణం. మొహర్రం ఉత్సవాలకు గూగూడు ప్రసిద్ధి. ఉత్సవాల సందర్భంగా భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను ఈ నెల 18న లెక్కించారు. నాలుగు హుండీలు లెక్కించినట్లు ఆలయ ఈఓ శోభారాణి ఇదివరకు మీడియా సమక్షంలో ప్రకటించారు. అయితే గురువారం ఆర్డీఓ కేశవనాయుడు ఆలయాన్ని సందర్శించి మీడియాతో మాట్లాడినపుడు ఐదు తాత్కాలిక, ఒక శాశ్వత హుండీలలోని కానుకలు లెక్కించినట్లు చెప్పారు. ఆర్డీఓ – ఈఓ మాటలకు పొంతన లేకుండా ఉండటంతో హుండీలలో కొన్ని మాయమయ్యాయా.. అందులోని కానుకలు ఏమయ్యాయి అంటూ భక్తుల్లో అనుమానాలు తలెత్తాయి. ఈ వ్యవహారం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అసలు ఎన్ని హుండీలు ఉన్నాయో అధికారులకు తెలియకపోవడం ఏమిటని చర్చించుకుంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి నిజానిజాలు వెల్లడించాలని కోరుతున్నారు.

పచ్చనేత అండతోనే మేత



- ఏసీబీకి చిక్కిన సబ్‌రిజిస్ట్రార్ కళ్యాణదుర్గం ప్రజాప్రతినిధికి బినామీ
- కూటమి సర్కారు రాగానే శింగనమల నుంచి పట్టుబట్టి కళ్యాణదుర్గానికి పోస్టింగ్
- కళ్యాణదుర్గంలో ఉన్న సబ్‌రిజిస్ట్రార్‌ను టార్చర్ పెట్టి వెళ్లగొట్టిన టీడీపీ నేత
- అనంతరం సీనియర్ అసిస్టెంట్ నారాయణస్వామికి ఇన్‌చార్జ్ సబ్‌రిజిస్ట్రార్ బాధ్యతలు
- ఓ కన్‌స్ట్రక్షన్ కంపెనీ పనుల్లో బినామీగా వ్యవహరించినట్లు ఆరోపణలు
- నకిలీ ఈ–స్టాంప్‌ల కుంభకోణంలోనూ సలహాలు ఇచ్చి ఉంటారని అనుమానాలు
- నారాయణ స్వామికంటే జలగలే నయమంటున్న రిజిస్ట్రేషన్ శాఖ సిబ్బంది

సాక్షి, టాస్క్‌ఫోర్స్: తాజాగా ఓ రైతు నుంచి రూ.5 లక్షలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన కళ్యాణదుర్గం సబ్‌రిజిస్ట్రార్ నారాయణ స్వామికి ఆ ప్రాంత టీడీపీ ప్రజాప్రతినిధి పూర్తి అండగా ఉన్నట్టు తెలుస్తోంది. నారాయణస్వామి అత్యంత అవినీతిపరుడని డిపార్ట్‌మెంట్‌లో పేరుంది. అలాంటి వ్యక్తిని కూటమి సర్కారు రాగానే పట్టుబట్టి పోస్టింగ్ వేయించుకున్నారంటే దీనివెనుక కథ ఏమిటో అంచనా వేయొచ్చు. ఒక సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న నారాయణస్వామికి సబ్‌రిజిస్ట్రార్ బాధ్యతలు అప్పజెప్పేవరకూ పనిచేయించారంటే అవినీతి కథ ఎలా నడిచిందో తెలుసుకోవచ్చు.

ఒత్తిడి తెచ్చి మరీ పోస్టింగ్..

నారాయణస్వామి శింగనమల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసేవారు. అప్పటికే కళ్యాణదుర్గం టీడీపీ నేత కంపెనీకి సంబంధించిన పనులు చేసి పెట్టేవారు. జిల్లాస్థాయిలో నారాయణస్వామి పోస్టింగ్‌కు అధికారులు స్పందించడం లేదని ఏకంగా విజయవాడలోని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ ఆఫీస్‌కు వెళ్లి ఆయన్ను కళ్యాణదుర్గం బదిలీ చేయించుకున్నారు. అప్పటికే కళ్యాణదుర్గంలో వెంకటనాయుడు అనే సబ్‌రిజిస్ట్రార్ ఉన్నారు. నారాయణస్వామి సీనియర్ అసిస్టెంట్‌గా వెళ్లాక టీడీపీ ప్రజాప్రతినిధితో కలిసి వెంకట నాయుడుకు టార్చర్ పెట్టారు. రాజకీయ ఒత్తిడి భరించలేక వెంకటనాయుడు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఆయన వెళ్లిన వెంటనే అనంతపురం డీఐజీతో మాట్లాడి నారాయణస్వామికే ఇన్‌చార్జ్ సబ్‌రిజిస్ట్రార్ బాధ్యతలు అప్పజెప్పేలా చేశారు.

పైకమిస్తేనే ఫైలుపై సంతకం..

నారాయణస్వామి సబ్‌రిజిస్ట్రార్‌గా బాధ్యతలు తీసుకున్నాక డబ్బు తీసుకోకుండా ఒక్క ఫైలు మీద కూడా సంతకాలు చేయలేదన్న ఆరోపణలున్నాయి. టీడీపీ నేతకు సంబంధించిన డాక్యుమెంట్లు ఎలా ఉన్నా చేయడంతో పాటు ఈయన ఇతరుల నుంచి వసూళ్లు చేసిన సొమ్ములో వాటాలిచ్చేవారని చెబుతున్నారు. టీడీపీ నేత కన్‌స్ట్రక్షన్ కంపెనీకి సంబంధించిన స్థలాలు, ఆస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లు కూడా నారాయణస్వామే చూసుకునేవారు. టీడీపీ నేత అండ చూసుకునే ఇష్టారాజ్యంగా అవినీతి అక్రమాలకు దిగేవారని సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులో పనిచేసే సిబ్బంది చెబుతున్నారు. నారాయణ స్వామికంటే జలగలే నయమని సిబ్బంది పేర్కొనడం గమనార్హం.

ఈ–స్టాంపుల కుభకోణంలోనూ స్వామి పాత్ర?

ఇటీవలే కళ్యాణదుర్గంలో అతిపెద్ద నకిలీ ఈ–స్టాంపుల కుంభకోణం బయటపడింది. ఇందులోనూ టీడీపీ నేతల ప్రముఖ పాత్ర ఉన్నట్టు ఆరోపణలు గుప్పుమన్నాయి. ఈ కుంభకోణంలో ప్రధాన పాత్రధారి 'మీ–సేవ' బాబు అయినా.. దీనికి సలహాలు, సూచనలు నారాయణస్వామి ఇచ్చి ఉంటారని అనుమానం కలుగుతున్నట్టు ఓ సబ్‌రిజిస్ట్రార్ వ్యాఖ్యానించారు. నారాయణస్వామి సలహా లేకుండా ఇంత పెద్ద సాహసానికి పాల్పడే ధైర్యం 'మీ–సేవ' బాబుకు లేదని అంటున్నారు. ఇలాంటి అవినీతిపరుడిని టీడీపీ నేత దగ్గరుండి పోస్టింగ్ వేయించుకున్నారంటే ఎంత అవినీతి చేసి ఉంటారో అంచనా వేయొచ్చు. కళ్యాణదుర్గం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంట్లు పరిశీలిస్తే మరిన్ని అక్రమాలు బయటకు వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.

కొనసాగుతున్న ఏసీబీ సోదాలు


సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సోదాలు చేస్తున్న ఏసీబీ అధికారులు

కళ్యాణదుర్గం: ఏసీబీ డీఎస్పీ జెస్సీ ప్రశాంతి నేతృత్వంలోని బృందం శుక్రవారం కూడా కళ్యాణదుర్గం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ముమ్మరంగా సోదాలు కొనసాగించింది. గురువారం రాత్రి నాగేంద్ర నాయక్ నుంచి భూమి కన్వర్షన్‌కు రూ.5 లక్షలు లంచం తీసుకుంటుండగా అనంతపురంలో ఏసీబీ అధికారులు కళ్యాణదుర్గం సబ్ రిజిస్ట్రార్ నారాయణ స్వామిని పట్టుకున్న విషయం విదితమే. ఈ క్రమంలోనే రాత్రికి రాత్రి కళ్యాణదుర్గం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చిన అధికారులు రెండో రోజూ కూడా కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్ సమక్షంలో కీలక ఫైళ్లను తనిఖీ చేశారు. ఇటీవల చేసిన భూముల కన్వర్షన్, మున్సిపాలిటీ పరిధిలో చేసిన రిజిస్ట్రేషన్ తదితర ఫైళ్లను నిశితంగా పరిశీలిస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని భూముల కన్వర్షన్ లేకుండానే ఎన్ని ఫైళ్లు రిజిస్ట్రేషన్ చేశారు.. డబుల్ రిజిస్ట్రేషన్లు.. ఇటీవల కళ్యాణదుర్గం, కంబదూరు, బ్రహ్మసముద్రం తహసీల్దార్ల సంతకాలు ఫోర్జరీ చేసి సృష్టించిన డాక్యుమెంట్లు తదితర వాటికి సంబంధించిన కీలక ఫైళ్లను తనిఖీ చేసి స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. రిజిస్ట్రేషన్ల వెనుక ఏవైనా రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయా.. ఎవరెవరికి వాటా వెళ్లింది.. అనే కోణంలో కూడా సబ్ రిజిస్ట్రార్‌ను ప్రశ్నించినట్లు సమాచారం. తనిఖీల అనంతరం ఫైళ్లను కర్నూలుకు తీసుకెళ్లనున్నట్లు ఏసీబీ డీఎస్పీ జెస్సీ ప్రశాంతి మీడియాకు తెలిపారు.

ఈ-స్టాంపుల కుంభకోణంలో దోషులను శిక్షించాలి

- ఎన్‌ఎస్‌హెచ్‌ఆర్ ప్రతినిధుల డిమాండ్

అనంతపురం సిటీ: రెండు తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేకెత్తించిన కళ్యాణదుర్గం ఈ–స్టాంపుల కుంభకోణంలో దోషులను శిక్షించాలంటూ నేషనల్ సొసైటీ ఫర్ హ్యూమన్ రైట్స్(ఎన్‌ఎస్‌హెచ్‌ఆర్) ప్రతినిధులు డిమాండ్ చేశారు. సంస్థ న్యాయ సలహాదారుడు ఓబుళపతి, ఉమ్మడి జిల్లాల యూత్ విభాగం అధ్యక్షుడు కేశవ్, విద్యా విభాగం ఉపాధ్యక్షుడు చంద్రమోహన్, హరీష్, గురు తదితరులు శుక్రవారం అనంతపురంలో మాట్లాడుతూ.. ఈ–స్టాంపుల కుంభకోణాన్ని కూటమి ప్రభుత్వంలోని కొందరు పెద్దలు పక్కదారి పట్టించడం దురదృష్టకరమన్నారు. ఈ వ్యవహారంలో ఓ ప్రజాప్రతినిధితో పాటు కళ్యాణదుర్గం సబ్ రిజిస్ట్రార్ పాత్రపై అనుమానాలు ఉన్నాయన్నారు. ఈ అంశానికి సంబంధించి రెవెన్యూ ముఖ్య కార్యదర్శి సహా రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ ఇన్‌స్పెక్టర్ జనరల్‌ను త్వరలో కలసి సమగ్ర విచారణను కోరనున్నట్లు వెల్లడించారు. బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు.

మాదకద్రవ్యాలు నియంత్రించాలి

అనంతపురం అర్బన్: జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు చర్యలు చేపట్టాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇన్‌చార్జి కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో నార్కో కో–ఆర్డినేషన్ సెంటర్ జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలు, గంజాయి, తదితర మాదకద్రవ్యాల నియంత్రణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. మత్తుకు బానిసలైన వారికి కౌన్సిలింగ్, డి–ఆడిక్షన్ సెంటర్ ద్వారా సహాయం అందించాలని చెప్పారు. సమావేశంలో డీఎస్పీ శ్రీనివాసరావు, రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, డీసీఆర్‌బీ సీఐ హరినాథ్, ఈగల్ వింగ్ ఇన్‌స్పెక్టర్ హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు పచ్చి అబద్ధాలకోరు

- మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి


విడపనకల్లులో 'బాబు షూ్యరిటీ- మోసం గ్యారంటీ' పోస్టర్లు విడుదల చేస్తున్న సమన్వయకర్త విశ్వేశ్వరరెడ్డి

విడపనకల్లు: ముఖ్యమంత్రి చంద్రబాబు పచ్చి మోసగాడని, అబద్ధాలకోరని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి మండిపడ్డారు. శుక్రవారం విడపనకల్లులో గౌరమ్మబావి మైదానంలో 'బాబు షూ్యరిటీ.. మోసం గ్యారంటీ' కార్యక్రమంపై వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆచరణకు సాధ్యం కాని హామీలు ఇవ్వడం.. అధికారంలోకి వచ్చాక పజలను వంచించడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని విమర్శించారు. సూపర్ సిక్స్‌లో ఒక్కటైన 'తల్లికి వందనం' పథకాన్ని అరకొరగా అమలు చేసి.. అన్ని పథకాలూ అమలు చేసేసినట్లు గొప్పలు చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వ తీరును ప్రజలు ఛీదరించుకుంటున్నారన్నారు. మహిళలను, విద్యార్థులను, రైతులను ఇలా అన్ని వర్గాల ప్రజలను మోసం చేసి నిస్సిగ్గుగా మాది మంచి ప్రభుత్వం అని చెప్పుకుంటూ 'సుపరి పాలనలో తొలి అడుగు' అని కార్యక్రమం చేపట్టడం సిగ్గుచేటన్నారు. ఏడాది పాలనకే రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేసిన మహా ఘనుడు చంద్రబాబు అని ధ్వజమెత్తారు. అనతికాలంలోనే కూటమి పాలనపై ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు. గతంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే 'నవరత్నాలు' పేరిట సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని అన్నారు.

రెడ్‌బుక్ మాటున అక్రమ కేసులు..

వైఎస్సార్‌సీపీకి చెందిన మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ అక్రమ కేసులు పెట్టి జైల్లో వేస్తున్న కూటమి ప్రభుత్వానికి నూకలు చెల్లే రోజులు దగ్గర పడ్డాయని విశ్వేశ్వరరెడ్డి అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో చూపని ఉత్సాహం 'రెడ్‌బుక్' రాజ్యాంగాన్ని అమలు చేయడంలో గిన్నిస్ బుక్ ఎక్కారని మండిపడ్డారు. ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, ఆడబిడ్డ నిధి కింద 18 ఏళ్ల నిండి 59 ఏళ్లలోపు మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామన్న హామీలు అమలు చేయకుండా మోసం చేశారన్నారు. అన్నదాత సుఖీభవ కింద రైతులకు ఏడాదికి రూ.20వేల పెట్టుబడి సాయం ఇస్తామని ఇంతవరకూ ఇవ్వకుండా దగా చేశారన్నారు. కూటమి నేతల అరాచకాలను, పథకాల అమలు విషయంలో చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కురుబ రమేష్, ఎంపీపీ పుష్పావతి, నాయకులు భరత్‌రెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వీరన్న, మండల అధ్యక్షుడు కురుబ గిరిబాబు, ఉప కన్వీనర్ బోయ నాగేంద్ర, సీనియర్ నాయకులు కరణం భీంరెడ్డి, దేశాయ్ సిద్ధార్థ, ఎస్సీసెల్ జిల్లా నాయకులు సుంకన్న, సర్పంచులు రామాంజనరెడ్డి, ఉమాశంకర్, కేశన్న, గాజుల చిన్న వెంకటేశులు, కుళ్లాయిస్వామి తదితరులు పాల్గొన్నారు.

జేసీ ప్రభాకర్‌రెడ్డిది నీచ సంస్కృతి

- మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

అనంతపురం మెడికల్: 'తాడిపత్రి మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి 'గుడ్ విల్' కోసం డీపీఓ, ఏఎస్పీలను బెదిరిస్తున్నారు. ఆయన భార్యను నేను తిట్టానని ప్రచారం చేస్తున్నాడు. రాజకీయాల్లోకి ఆడవారిని తీసుకువచ్చే నీచ సంస్కృతి జేసీ ప్రభాకర్‌రెడ్డిది. నిజంగా నేను తిట్టానని ఆమె చెబితే వారి ఇంటి వద్దకు వెళ్లి క్షమాపణ చెబుతా' అని వైఎస్సార్‌సీపీ తాడిపత్రి నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. శుక్రవారం అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. లే అవుట్ల అనుమతులకు సంబంధించి డీపీఓను, పవర్ గ్రిడ్ పనుల్లో తనకు మేలు జరగలేదని ఏఎస్పీను జేసీ ప్రభాకర్‌రెడ్డి దుర్భాషలాడారన్నారు. తాడిపత్రిలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన లే అవుట్ల అనుమతులకు సంబంధించి కలెక్టర్‌కు జేసీ ఫిర్యాదు చేయాలని, తాను ప్రతిపక్ష పార్టీ తరఫున ఫిర్యాదు చేస్తానని చెప్పారు. కలెక్టర్ విచారణలో అసలు నిజాలు వెలుగు చూస్తాయన్నారు. ఇటీవల తాడిపత్రిలో 'బాబు షూ్యరిటీ.. మోసం గ్యారంటీ' కార్యక్రమానికి తన కోడలను పంపితే.. ఆమె ప్రసంగం పూర్తవగానే పోలీసుల ద్వారా ఇంటికి పంపించేశారని అన్నారు. ఇది జేసీ నీచ సంస్కృతికి నిదర్శనమన్నారు.


మాట్లాడుతున్న పెద్దారెడ్డి

దొంగే దొంగ అన్నట్లుంది జేసీ తీరు

తనపై వంద కేసులున్నాయని, తనకు న్యాయం చేయాలని జేసీ ప్రతిసారీ పరితపిస్తున్నారని పెద్దారెడ్డి విమర్శించారు. వాస్తవానికి ఫేక్ రిజిస్ట్రేషన్, ఇన్సూ్యరెన్స్‌లతో అక్రమాలకు పాల్పడి ఆయన కటకటాల్లోకి వెళ్లి వచ్చారన్నారు. ఆయనేమైనా పార్టీ కోసమో, కార్యకర్తలు, నాయకుల కోసమే జైలుకు వెళ్లలేదని స్పష్టం చేశారు. వందల సంఖ్యలో ఉన్న కేసుల పూర్వాపరాలను సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ పరిశీలిస్తే జేసీ నీచ సంస్కృతి బయటపడుతుందన్నారు. దొంగే దొంగ అన్నట్లుగా జేసీ ప్రభాకర్‌రెడ్డి తీరు ఉందని మండిపడ్డారు. పోలీసు అధికారుల వద్దకు వెళ్లి కేసు నమోదు చేయించాలన్నారు.

రోడ్డు ప్రమాదాలు నివారించాలి


అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ

అనంతపురం అర్బన్: రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా పటిష్ట చర్యలు చేపట్టాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులతో రోడ్డు భద్రతపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రమాదాలు అధికంగా చోటు చేసుకునే ప్రదేశాల్లో (బ్లాక్‌స్పాట్) హెచ్చరిక సూచిక బోర్డులు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు విస్తృతస్థాయిలో నిర్వహించాలన్నారు. ప్రధానంగా హెల్మెట్ ధారణ విషయంలో కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ ప్రయాణికులను చేరవేసే వాహనాల్లో అధికలోడ్ నియంత్రించాలని సూచించారు. సమావేశంలో ఆర్టీఓ వీర్రాజు, డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్‌డీఓ కేశవనాయుడు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పారిశ్రామిక రంగాన్ని పటిష్టం చేయాలి..

జిల్లాలో పారిశ్రామిక రంగం పటిష్టం చేయాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ్ శర్మ అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేసేలా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని చెప్పారు. పరిశ్రమల స్థాపనకు అందిన దరఖాస్తులకు సకాలంలో అన్ని రకాలు అనుమతులు మంజూరు చేయాలని ఆదేశించారు. ఎంఎస్‌ఎంఈ పార్కుల ఏర్పాటుకు అనువైన భూమిని గుర్తించాలన్నారు. జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేయనున్న రతన్‌టాటా ఇన్నొవేషన్ హబ్ ద్వారా యువతకు సాంకేతిక పరిజ్ఞానం బదిలీ, నైపుణ్య శిక్షణ అందించి ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 2020–23, 2023–27 ఇండస్ట్రియల్ పాలసీ కింద 13 యూనిట్లకు సబ్సిడీ మంజూరుకు కమిటీ ఆమోదం తెలిపింది. సమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం శ్రీనివాస్‌యాదవ్, ఏడీ రాజశేఖర్ రెడ్డి, వాణిజ్య పన్నుల శాఖ అధికారి కృష్ణారెడ్డి, డీఎస్‌డీఓ ప్రతాపరెడ్డి, తదితరులు పాల్గొనానరు.

వ్యాపారి ఘరానా మోసం

- రూ.6.22 కోట్లకు టోకరా
- లబోదిబోమంటున్న బాధితులు
- న్యాయం కోసం పోలీసుస్టేషన్‌కు..


నగేష్‌బాబు (ఫైల్)

ఉరవకొండ: పట్టణంలో ఓ వ్యాపారి ఘరానా మోసానికి పాల్పడ్డాడు. పలువురి నుంచి నగదు తీసుకుని.. తిరిగి వారికి చెల్లించకుండా ముఖం చాటేశాడు. దాదాపు రూ.6.22 కోట్లకు ఐపీ పెట్టేసి టోకరా వేశాడు. బాధితులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. ఉరవకొండ పట్టణంలోని రంగావీధిలో బొమ్మశెట్టి నగేష్‌బాబు, లావణ్య దంపతులు నివాసముంటున్నారు. వీరు కిరాణా దుకాణం నిర్వహిస్తున్నారు. అలా ప్రజలతో ఏర్పడిన పరిచయాలతో చిట్టీల వ్యాపారం మొదలు పెట్టారు. వీరిపై నమ్మకం కలగడంతో చాలామంది పరిచయస్తులు, చిరువ్యాపారులు, చేనేత కార్మికులతో పాటు అన్ని వర్గాలకు చెందిన వారు అవసరాలకు పనికి వస్తుందని, పొదుపు చేసుకుందామని భావించి రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షల దాకా చిట్టీలు వేశారు. ఉరవకొండతో పాటు ధర్మవరం, గుంతకల్లు, అనంతపురం తదితర ప్రాంతాలకు చెందిన వారు అప్పుల రూపంలోనూ వారికి ఇచ్చారు. ఈ క్రమంలో రెండు వారాల క్రితం అనారోగ్యంగా ఉందని చెప్పిన నగేష్ తర్వాత కనిపించలేదు. కుటుంబ సభ్యులు కూడా ఎవ్వరూ లేరు. ఇంటికి తాళం వేసి ఉంది. ఫోన్ స్విచాఫ్ వస్తుండటంతో అనుమానం వచ్చిన బాధితులు ఆరా తీయగా.. డబ్బుతో ఉడాయించినట్లు తెలిసింది.



కలకలం రేపిన ఐపీ నోటీసు..

బాధితుల అనుమానాలకు ఊతం ఇచ్చేలా శుక్రవారం పలువురి సెల్‌ఫోన్లకు నగేష్‌బాబు–లావణ్య దంపతుల తరఫున అడ్వొకేట్ నుంచి ఇన్‌సాల్వెన్సీ పిటిషన్ (ఐపీ) నోటీసు పంపారు. ఐపీ నోటీసు అలా ఒకరి నుంచి మరొకరికి చేరడంతో కలకలం రేగింది. కిరాణా వ్యాపార విస్తరణ కోసం 57 మంది నుంచి రూ.6.22 కోట్ల వరకు నగదు తీసుకున్నట్లు.. ప్రస్తుతం వ్యాపారంలో నష్టం కారణంగా తిరిగి చెల్లించలేకపోతున్నట్లు, నగదు రికవరీ కోసం ఒత్తిళ్లు తీవ్రస్థాయిలో పెరిగిపోతుండటంతో భరించలేక ఐపీ పెడుతున్నట్లు నోటీసులో పేర్కొన్నారు. నమ్మకంతో చిట్టీలు వేసినందుకు.. అప్పులు ఇచ్చినందుకు ఇప్పుడు ఐపీ పెట్టేసి నట్టేటముంచితే తమ పరిస్థితి ఎలా అని బాధితులు ఆందోళన చెందుతున్నారు.

మాకు న్యాయం చేసేదెవరు..?

తన కూతురుకు మూడుసార్లు బైపాస్ సర్జరీలు జరిగాయని, తదుపరి వైద్య అవసరాల కోసమని నగేష్‌బాబు వద్ద దాదాపు రూ.14 లక్షలు చిట్టీ వేశానని, ఇప్పుడిలా ఐపీ పెట్టేస్తే ఎలా అని ఉరవకొండకు చెందిన కిరణ్‌కుమార్ అనే హోటల్ నిర్వాహకుడు ఆవేదన వ్యక్తం చేశాడు. తమకు న్యాయం చేయాలని అర్బన్ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించాడు. తామేమీ చేయలేమని పోలీసులు తెలిపారని, ఇక తాము ఎక్కడికి వెళ్లాలని కన్నీటి పర్యంతమయ్యాడు.


కిరణ్‌కుమార్

క్లుప్తంగా

రుద్రంపల్లిలో గుప్త నిధుల తవ్వకాలు

కళ్యాణదుర్గంరూరల్/కుందుర్పి: కుందుర్పి మండలం రుద్రంపల్లి గ్రామ మల్లేశ్వరస్వామి ఆలయ సమీపంలో గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గుప్తనిధుల కోసం తవ్వకాలు చేపట్టారు. విషయం తెలియడంతో అప్రమత్తమైన కుందుర్పి పోలీసులు వెంటనే అక్కడకు చేరుకున్నారు. తవ్వకాలు సాగిస్తున్న జేసీబీతో పాటు 14 మంది అనుమానితులను అదుపులోకి తీసుకుని, శుక్రవారం ఉదయం కళ్యాణదుర్గం రూరల్ పీఎస్‌కు తరలించారు. అయితే ఈ విషయాన్ని పోలీసులు గుట్టుగా ఉంచారు.

కంప్యూటర్ శిక్షణ.. ఉపాధి

అనంతపురం అగ్రికల్చర్: నిరుద్యోగ యువతీ యువకులకు కంప్యూటర్ కోర్సులపై అనంతపురంలోని ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వడంతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు. ఈ మేరకు ఆ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ వైవీ మల్లారెడ్డి శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. బేసిక్స్ కంప్యూటర్ స్కిల్స్, ఎంఎస్ ఆఫీసు, లైఫ్ స్కిల్స్, వర్క్‌ప్లేస్ ఎథిక్స్, స్పోకెన్ ఇంగ్లిష్ బేసిక్స్, కస్టమర్ రిలేషన్‌షిప్ స్కిల్స్ తదితర అంశాలపై 45 రోజుల పాటు శిక్షణ ఉంటుంది. 20 నుంచి 35 సంవత్సరాలున్న వారు, ఇంటర్, డిప్లొమా పాస్, డిగ్రీ, ఇంజనీరింగ్ పాస్ లేదా ఫెయిల్ అయిన వారు అర్హులు. శిక్షణా కాలంలో మధ్యాహ్న భోజన వసతి ఉంటుంది. శిక్షణ తర్వాత సర్టిఫికెట్‌తో పాటు వంద శాతం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారు. వివరాలకు 73969 50345లో సంప్రదించవచ్చు.

గుప్త నిధుల ముఠా అరెస్ట్

- తవ్వకాల్లో వెలికి తీసిన వస్తువుల స్వాధీనం


నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

గుంతకల్లు రూరల్: మండలంలోని నాగసముద్రం గ్రామ సమీపంలో ఉన్న కొండపై వెలసిన చౌడమ్మ ఆలయం వద్ద గుప్త నిధుల కోసం తవ్వకాలు సాగిస్తున్న ముఠా సభ్యులను అరెస్ట్ చేసి, తవ్వకాల్లో బయటపడిన వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు ప్రొబేషనరీ డీఎస్పీ అష్రఫ్ ఆలీ తెలిపారు. గుంతకల్లు రూరల్ పీఎస్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ రాఘవేంద్రప్పతో కలసి వివరాలను ఆయన వెల్లడించారు.

పథకం ప్రకారం తవ్వకాలు..

నాగసముద్రం కొండపై వెలసిన చౌడమ్మ ఆలయం సమీపంలో గుప్త నిధులు వెలికి తీసేందుకు నాగసముద్రం గ్రామానికి చెందిన ఇద్దరు, వజ్రకరూరు మండలం కొనకొండ్ల గ్రామానికి చెందిన రాము, కమలపాడు గ్రామానికి చెందిన బురుజుల బోయ శ్రీనివాసులు, గుంతకల్లులోని దోనిముక్కల రోడ్డులో నివాసముంటున్న మేకల దేవేంద్ర, పామిడి మండలం గజరాంపల్లికి చెందిన జె.పరశురాముడు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో తెలంగాణలోని శంషాబాద్ మండలం బహుదూర్‌గూడ ప్రాంతానికి చెందిన పసుపుల మహేందర్, వికారాబాద్ జిల్లా, పరిగి మండలం రూపాన్‌పేట్ గ్రామానికి చెందిన ఇరికల వెంకటేశులు, రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం నానాజీపూర్ గ్రామానికి చెందిన మాడ మహేందర్, నారాయణపేట జిల్లా కోసిగి మండలం బిజ్జారం గ్రామానికి చెందిన భట్టగిరి అంజులయ్య, రంగారెడ్డి జిల్లా బోరబండ గ్రామానికి చెందిన ముద్దనూరి సురేంద్రతో కలసి పథకం రచించారు. ఇందులో భాగంగా ఈ నెల 24న గుప్త నిధుల తవ్వకాలకు అవసరమైన పరికరాలతోపాటు, నిధి నిక్షేపాలను గుర్తించే మెటల్ డిటెక్టర్‌లను సైతం గుంతకల్లులోని బోయ శ్రీనివాసులుకు చెందిన ఏపీ02 టీబీ 2351 నంబర్ ఉన్న ఆప్పీ ఆటోలో నాగసముద్రం కొండపైకి తరలించారు. మరికొందరు ఏపీ 09 బీసీ 3031 నంబర్ గల ఇన్నోవా కారులో కొండపైకి చేరుకున్నారు. మెటల్ డిటెక్టర్ సాయంతో నిధి నిక్షేపాల కోసం గాలించిన ముఠా సభ్యులు ఓ చోట తవ్వకాలను ప్రారంభించారు.

బయటపడిన నాగ పడిగ ప్రతిమ..

కొండపై అనుమానితుల సంచారాన్ని పసిగట్టిన నాగసముద్రం గ్రామస్తుల సమాచారంతో అప్రమత్తమైన పోలీసులు, గ్రామ పెద్దలతో కలసి గురువారం కొండపైకి చేరుకున్నారు. పోలీసుల రాకను గమనించిన ఇద్దరు అక్కడి నుంచి పారిపోగా, మిగిలిన 9 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఆలయ పరిసరాల్లో గుప్త నిధులు వెలికి తీస్తున్నట్లుగా వారు అంగీకరించారు. అప్పటి వరకూ తవ్వకాల్లో బయటపడిన వస్తువులను పోలీసులకు చూపారు. అందులో ఓ మట్టి కుండలో 8 సీసపు గోలీలు, సీసపు కడ్డీలు, పురాతన కాలానికి చెందిన రెండు చిన్న ఉంగరాలు, నాగ పడగ కలిగిన ప్రతిమ, చతురస్రాకారంలో ఉన్న ఒక మట్టి ప్రతిమ ఉన్నాయి. వీటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాగా, పరారైన వారిలో నాగసముద్రం గ్రామానికి చెందిన సూరి, నారాయణస్వామి ఉన్నట్లు తెలిసింది. నిందితులపై కేసు నమోదు చేసి, విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జంట ఆత్మహత్యాయత్నం

- కదులుతున్న రైలు నుంచి దూకి వివాహిత మృతి
- రైల్వే ట్రాక్‌పై పడుకొని యువకుడి ఆత్మహత్యాయత్నం
- సకాలంలో అక్కడికి చేరుకుని కాపాడిన పోలీసులు


పోలీసుల ఆధీనంలో ఉన్న మహేష్


మృతురాలు దీపిక

గార్లదిన్నె: ఉపాధి అవకాశాలు దక్కకపోవడంతో ఓ జంట ఆత్మహత్యాయత్నం చేసింది. కదులుతున్న రైలు నుంచి దూకి వివాహిత మృతి చెందగా.. రైలు పట్టాలపై పడుకుని ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడిని స్థానికుల సాయంతో పోలీసులు కాపాడారు. పోలీసులు తెలిపిన మేరకు... నంద్యాల జిల్లా ఐలూరుకు చెందిన మహేష్ బతుకు తెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లాడు. అక్కడ అప్పటికే వివాహమై భర్త మృతిచెంది ఒంటరిగా జీవిస్తున్న దీపిక పరిచయమైంది. ఇద్దరూ కలసి సహజీవనం సాగించేవారు. ఈ క్రమంలో పని కోసం వారం రోజుల క్రితం ఇద్దరూ గుంటూరుకు వెళ్లారు. అక్కడ పని దొరక్కపోవడంతో గుంతకల్లు మీదుగా గురువారం అనంతపురానికి చేరుకున్నారు. అక్కడ కూడా పని దొరక్కపోవడంతో తిరిగి హైదరాబాద్‌కు వెళ్లేందుకు సిద్ధమై అదే రోజు రాత్రి కాచిగూడ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కారు. మార్గమధ్యంలో దీపిక కదులుతున్న రైలు నుంచి కిందకు దూకేసింది. పక్క స్టేషన్‌లో రైలు ఆగగానే కిందకు దిగిన దీపక్ రోడ్డు మార్గంలో గార్లదిన్నె మండలం ఎగువపల్లి సమీపంలోకి శుక్రవారం తెల్లవారుజామున చేరుకున్నాడు. జాతీయ రహదారి పక్కన వాకింగ్ చేస్తున్న స్థానికులను కలసి రైల్వే స్టేషన్‌కు మార్గాన్ని అడిగి, అటుగా కాకుండా నేరుగా రైల్వే ట్రాక్‌పై చేరుకుని పట్టాలపై అడ్డంగా పడుకున్నాడు. గమనించిన స్థానికులు వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో గార్లదిన్నె ఎస్ఐ గౌస్ మహమ్మద్‌బాషా, సిబ్బంది అక్కడకు చేరుకుని యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో జరిగిన విషయం తెలిపి తన సహచరి రైలు నుంచి దూకిందని, తాను కూడా ఆత్మహత్య చేసుకునేందుకు సిద్ధపడినట్లు వివరించాడు. ఈ విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు గార్లదిన్నె – కల్లూరు మధ్య ట్రాక్‌పై పరిశీలన చేపట్టారు. కల్లూరు రైల్వే స్టేషన్ సమీపంలో రామదాస్‌పేట వద్ద పట్టాలపై యువతి మృతదేహాన్ని గుర్తించారు. మృతురాలిని దీపికగా మహేష్ నిర్ధారించాడు. ఘటనపై రైల్వే ఎస్ఐ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

నలుగురు విద్యార్థులూ క్షేమం

అనంతపురం: ఎవరికీ చెప్పకుండా గురువారం మధ్యాహ్నం పాఠశాల నుంచి వెళ్లిపోయిన నలుగురు విద్యార్థుల ఆచూకీని పోలీసులు గుర్తించారు. అనంతపురం నుంచి తిరుమలకు వెళ్లిపోవడంతో అక్కడి నుంచి శుక్రవారం అనంతపురానికి తీసుకువస్తున్నారు. కూడేరు, నార్పల, గార్లదిన్నె, గోరంట్ల మండలాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఒకటో రోడ్డులోని పొట్టిశ్రీరాములు పాఠశాలలో 8, 9, 10వ తరగతులు చదువుతున్నారు. మూడో రోడ్డులోని బీసీ హాస్టల్‌లో ఉంటున్నారు. తరచూ పాఠశాలకు డుమ్మా కొడుతుండడంతో హెచ్‌ఎం మందలించారు. దీంతో నలుగురూ ఏకమై స్కూల్ నుంచి వెళ్లిపోయారు. విద్యార్థుల మిస్సింగ్‌పై హాస్టల్ వార్డెన్ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసిన అనంతపురం మూడో పట్టణ పీఎస్ సీఐ శాంతిలాల్.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో విద్యార్థులు తిరుమలలో ఉన్నట్లుగా పసిగట్టి, అక్కడి పోలీసు వారి సహకారంతో అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని అనంతపురానికి తీసుకువస్తున్నారు.

రైతు సభ్యత్వమంటూ ఘరానా మోసం


రైతులు నిలదీయడంతో ద్విచక్ర వాహనంపై ఉడాయిస్తున్న జంట

పామిడి: రైతు సభ్యత్వ కార్డు ఉంటే ప్రధాని నరేంద్ర మోదీ స్కీమ్ పేరుతో కేంద్ర ప్రభుత్వం రూ.లక్షల్లో బ్యాంక్ రుణాలు ఇస్తుందంటూ ఓ జంట మోసానికి తెరలేపిన ఘటన పామిడి మండలంలో వెలుగు చూసింది. వివరాలు.. నాలుగు రోజులుగా ఇద్దరు వ్యక్తులు (వీరిలో ఒకరు మహిళ) ద్విచక్ర వాహనంపై పామిడి మండలంలోని గ్రామాల్లో తిరుగుతూ రైతు సభ్యత్వ కార్డులంటూ పలువురి నుంచి డబ్బు వసూళ్లకు తెరలేపారు. శుక్రవారం ఉదయం పి.కొత్తపల్లికి చేరుకుని రైతులతో సమావేశమై మాట్లాడారు. ప్రధాని స్కీమ్ అంటూ నమ్మబలికారు. దీంతో దాదాపు 500 మంది రైతులు ఒక్కొక్కరు రూ.200 చొప్పున చెల్లించి సభ్యత్వ కార్డులు పొందారు. విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన ఓ రైతు అనుమానం వచ్చి వారిని నిలదీయడంతో ద్విచక్ర వాహనంపై ఉడాయించారు.

తహసీల్దార్ నిర్దయ.. వీధిన పడిన కుటుంబం


కూల్చివేసిన షెడ్డు వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధితులు

ఆత్మకూరు: మండల తహసీల్దార్ నిర్దయ.. ఓ కుటుంబాన్ని రోడ్డు పాలు చేసింది. తహసీల్దార్ కార్యాలయ ప్రహరీకి అనుకుని షెడ్డు వేసుకుని ముగ్గురు చిన్నారుల అలనాపాలన చూసుకుంటున్న వృద్ధురాలి పట్ల కఠినత్వాన్ని చూపుతూ అధికారులు షెడ్డును కూల్చేశారు. వివరాలు.. తల్లి మృతితో ముగ్గురు చిన్నారుల పోషణ భారం ఆత్మకూరులో నివాసముంటున్న వృద్ధురాలు గిరిజమ్మ (చిన్నారులకు అమ్మమ్మ)పై పడింది. అల్లుడు మద్యానికి బానిసై జులాయిగా మారాడు. దీంతో తనకు వచ్చే పింఛన్‌తోనే పిల్లల ఆలనాపాలన చూసుకుంటూ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తోంది. తనకు ఇల్లు లేకపోవడంతో ఎలాగైనా సాయం చేయాలని నెల రోజుల క్రితం తహసీల్దార్ లక్ష్మీనాయక్‌ను కలసి వేడుకుంది. దీంతో అప్పట్లో సానుకూలంగా స్పందించిన తహసీల్దార్... తన కార్యాలయం పక్కన ప్రహరీని అనుకుని షెడ్డు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దీంతో గిరిజమ్మ అప్పు చేసి బండలు పాతుకుని రేకుల షెడ్డు వేసుకుంది. శుక్రవారం ఉన్నఫలంగా తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది అక్కడకు చేరుకుని షెడ్డును తొలగించారు. పిల్లలు అన్నం తింటున్నారని కాస్త సమయం ఇవ్వాలని వృద్ధురాలు వేడుకున్నా వినలేదు. తహసీల్దార్ చెప్పారంటూ ఇంట్లోని సామగ్రిని బయటకు విసిరేశారు. రేకులను తొలగించి పక్కన వేశారు. దీంతో కన్నీటి పర్యంతమైన వృద్ధురాలిని చూసి స్థానికులు కొందరు తహసీల్దార్‌ను నేరుగా కలసి నిలదీశారు. దీంతో తప్పు సరిదిద్దుకుంటానని, ఆ ముగ్గురు పిల్లలను తానే దత్తతకు తీసుకుంటానని భరోసానిచ్చారు. రెండు సెంట్ల స్థలం కేటాయించి, అందులో షెడ్డు నిర్మాణానికి అయ్యే ఖర్చుతో పాటు అప్పటి వరకూ అద్దె ఇంట్లో ఉండే ఖర్చునూ భరిస్తానని హామీనిచ్చారు.

పశు పోషకుల స్థితిగతులపై బ్లాంకెట్ సర్వే

అనంతపురం అగ్రికల్చర్: పశుపోషకుల ఆర్థిక స్థితిగతులు, కుటుంబ పరిస్థితులపై 'బ్లాంకెట్ సర్వే' చేపట్టినట్లు పశుసంవర్ధకశాఖ ఇన్‌చార్జి జేడీ డాక్టర్ కేఎల్ శ్రీలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఆమె 'సాక్షి'తో మాట్లాడుతూ.. పశువులు, జీవాలపై పూర్తిగా ఆధారపడి జీవనం సాగిస్తున్న కుటుంబాల స్థితిగతులు తెలుసుకుని భవిష్యత్తులో వారికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ఎలా అందించాలనే దానిపై సర్వే చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, పశుశాఖ డైరెక్టరేట్ ఆదేశాల మేరకు సెప్టెంబర్ 15 వరకూ 45 రోజుల పాటు ఈ సర్వే జరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా 87,759 కుటుంబాలను కలిసి సర్వే చేయాలనే లక్ష్యం కాగా, గ్రామాల వారీగా ఎంత మందిని సర్వే చేయాలనే దానిపై ఇప్పటికే జాబితాతో పాటు ఫార్మాట్, లింక్ ఇచ్చినట్లు వివరించారు. పశుపోషకులు, జీవాల కాపరి కుటుంబాలను కలిసి కుటుంబ ఆర్థిక పరిస్థితులు, అప్పులు, వడ్డీలు, బ్యాంకు రుణాలు తదితర వివరాలు సేకరిస్తామన్నారు. అలాగే వారికున్న పశువులు, జీవాలు, ప్రభుత్వం, పశుశాఖ ద్వారా అందుతున్న ప్రయోజనాలు, పథకాలు, వైద్య సేవలు, బీమా పథకాలు, పరిహారం, కృత్రిమ గర్భోత్పత్తి సేవలు అందుతున్నాయా లేదా అనే అన్ని రకాల వివరాలు సర్వేలో పొందుపరచాల్సి ఉందన్నారు.

జిల్లా రైతులను ఆదుకోవాలి : సీపీఎం


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప

అనంతపురం అర్బన్: జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప డిమాండ్ చేశారు. స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో 3.40 లక్షల హెక్టార్లలో పంటల సాగు కావాల్సి ఉండగా... ఇందులో కేవలం 70 వేలు హెక్టార్లలో మాత్రమే సాగైనట్లు అధికారిక నివేదికలు చెబుతున్నాయన్నారు. జూన్, జూలై మాసాల్లో సాధారణ వర్షపాతం నమోదు కాకపోవడంతో ఇప్పటికే సాగైన పంటలు ఎండిపోయేపరిస్థితి నెలకొందన్నారు. యాడికి, పెద్దవడుగూరు మండలాల్లో వేసిన పత్తి పంట వర్షాభావం కారణంగా ఎదుగుదల లేకపోవడంతో రైతులు తొలగిస్తున్నారన్నారు. ఎకరాకు రూ.30 వేలు పెట్టుబడి పెట్టి నష్టపోయారన్నారు. వర్షం కురిస్తే ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకు పెట్టుబడికి డబ్బులు లేక రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. గత ఏడాది నష్టపోయిన పంటలకు పరిహారం, పంటల బీమా, ఎన్నికల హామీ మేరకు అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు తక్షణమే ప్రతి రైతుకూ చెల్లించి ఆదుకోవాలన్నారు. సమావేశంలో కార్యదర్శివర్గ సభ్యులు బాలరంగయ్య, నాగేంద్రకుమార్, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ భూముల పరిశీలన

శెట్టూరు: మండలంలోని కమతనహళ్లి, కనుకూరు గ్రామాల్లో అగ్రిగోల్డ్ సంస్థ కొనుగోలు చేసిన భూములను సీఐడీ సీఐ అశోక్, ఎస్ఐ జగదీశ్వరరెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారి వెంట తహసీల్దార్ ఈశ్వరమ్మ, డిప్యూటీ తహసీల్దార్ అనిల్‌కుమార్ రెడ్డి, సర్వే సిబ్బంది ఉన్నారు.

డీఎల్‌డీఏ ఈఓగా డాక్టర్ వెంకటేష్

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ (డిస్ట్రిక్ లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ– డీఎల్‌డీఏ) ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఈఓ)గా డాక్టర్ జి.వెంకటేష్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ఎక్స్ అఫిషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. పశుసంవర్ధకశాఖ ఉరవకొండ డివిజన్‌లో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఆయన నెల క్రితమే శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలో ఉన్న వెటర్నరీ పాలీక్లినిక్ (వీపీసీ) డీడీగా బదిలీ అయ్యారు. తాజాగా అనంతపురంలో ఉన్న డీఎల్‌డీఏ ఈఓగా ఫారిన్ సర్వీసు కింద ఏడాది పాటు కొనసాగేలా ఉత్తర్వులు జారీ అయ్యాయి. కాగా ఇక్కడ ఇంతకాలం ఈఓగా ఉన్న డాక్టర్ టీవీ సుధాకర్ పదవీ కాలం ఈ నెల 14న ముగిసింది. ఆయనను ఉరవకొండ డీడీగా నియమించినట్లు ఆ శాఖ వర్గాలు తెలిపాయి.

అత్యాచారయత్నం కేసు నమోదు

యాడికి: మహిళా కూలీపై అత్యాచారయత్నం చేసిన యాడికి మండలం లక్షుంపల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్వరరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమణయ్య తెలిపారు. శుక్రవారం తోటలో నిమ్మకాయలు తొలగిస్తున్న తనపై వెంకటేశ్వరరెడ్డి అత్యాచారానికి ప్రయత్నించినట్లు బాధితురాలు ఫిర్యాదు చేసినట్లుగా వివరించారు.

జల చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు


హెచ్చెల్సీపై వేసిన పైపులను తొలగిస్తున్న అధికారులు

కణేకల్లు: హెచ్చెల్సీ నీటిని చౌర్యం చేస్తే చర్యలు తప్పవని నాన్ ఆయకట్టుదారులను కణేకల్లు హెచ్చెల్సీ సబ్‌డివిజన్ డీఈఈ దివాకర్ రెడ్డి హెచ్చరించారు. కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లోని హెచ్చెల్సీపై శుక్రవారం ఏఈఈలు నరేంద్రమారుతి, అల్తాఫ్‌తో కలసి ఆయన పర్యటించారు. కాలువ గట్టు ఇరువైపులా నాన్ ఆయకట్టుదారులు మోటార్లు, పైపులు వేసి జల చౌర్యానికి పాల్పడుతున్న తీరును గుర్తించి దాదాపు 40 చోట్ల పైపులను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో డీఈఈ మాట్లాడుతూ.. హెచ్చెల్సీ ఆయకట్టు రైతులకు సాగు నీరందించడమే తమ ప్రథమ కర్తవ్యమన్నారు. నీటిచౌర్యాన్ని కట్టడి చేయడానికి నిరంతరం హెచ్చెల్సీపై గస్తీలు నిర్వహిస్తామన్నారు. మోటార్లు వేయడం, పైపుల ద్వారా నీటిని తోడటం లాంటివి చేస్తే ఎక్కడికక్కడే ధ్వంసం చేస్తామన్నారు.

నేటి నుంచి నిస్సహాయులకు ఇంటి వద్దే రేషన్

అనంతపురం, అర్బన్: వయసు 65 ఏళ్లపైబడిన వారికి, దివ్యాంగులు, నిస్సహాయులకు శనివారం నుంచి ఇళ్ల వద్దకే డీలర్లు వెళ్లి రేషన్ పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ పౌర సరఫరాల అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్ నుంచి పౌర సరఫరాలు, విజిలెన్స్, తూనికలు కొలతల శాఖల అధికారులు, తహసీల్దార్లు, సీఎస్‌డీటీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వృద్ధులు, దివ్యాంగులు, నిస్సహాయుల ఇళ్ల వద్దకే వెళ్లి సరుకులను ఈ నెల 30లోగా పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. చౌక ధరల దుకాణాల రెన్యూవల్, కార్డుల్లో సభ్యుల తొలగింపు, ఆధార్ సీడింగ్‌లో తప్పులు సరిజేత, బియ్యం కార్డు అప్పగింత, కార్డుల విభజన, ఈ–కేవైసీకి సంబంధించి పెండింగ్ పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి నెలా చౌక ధరల దుకాణాలు, పెట్రోల్ బంకులు, గ్యాస్ ఏజెన్సీలను తనిఖీ చేసి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. సమావేశంలో డీఎస్ఓ వెంకటేశ్వర్లు, పౌర సరఫరాల సంస్థ డీఎం రమష్‌రెడ్డి, డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి, డీజిలెన్స్ సీఐ శ్రీనివాసులు, ఇన్‌స్పెక్టర్ శంకర్, డిప్యూటీ తహసీల్దారు శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

యంత్రం కింద పడి కూలీలకు గాయాలు


క్షతగాత్రులకు చికిత్స చేస్తున్న వైద్యులు

బొమ్మనహాళ్: వేరుశనగ నూర్పిడి యంత్రం కిందపడి పలువురు కూలీలు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన మేరకు.. బొమ్మనహాళ్ మండలం గోవిందవాడ గ్రామానికి చెందిన వంద్రప్ప, రామలింగ, గణేష్, శీన, రామాంజనేయులు, కిరణ్‌తో పాటు మరో నలుగురు కూలీలు శుక్రవారం ఉదయం రైతు చెన్నప్ప పొలంలో వేరుశనగ కాయలు ఆడించేందుకు ట్రాక్టర్ సాయంతో నూర్పిడి యంత్రాన్ని తీసుకుని బయలుదేరారు. వేరుశనగ యంత్రంపై ఇరువైపులా కూలీలు కూర్చొని ప్రయాణిస్తున్నారు. కొద్ది దూరం వెళ్లగానే ట్రాక్టర్‌కు అనుసంధానించిన రాడ్ కట్ కావడంతో నూర్పిడి యంత్రం కిందపడింది. దానిపై కూర్చొన్న కూలీలందరూ రోడ్డుపై పడి, తీవ్రంగా గాయపడ్డారు. అటుగా వెళుతున్న వారు గుర్తించి క్షతగాత్రులను ఉరవకొండలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరిలో వంద్రమ్మ, రామలింగ, శీన, గణేష్‌కు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం అనంతపురంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. మరికొందరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

నెలాఖరులోపు పూర్తవ్వాలి

- సూక్ష్మ సేద్యంపై ఉద్యానశాఖ కమిషనర్ శ్రీనివాసులు ఆదేశం

అనంతపురం అగ్రికల్చర్: డ్రిప్, స్ప్రింక్లర్లకు సంబంధించి గతేడాది మంజూరు చేసి ఇంకా పొలాల్లో బిగించని వాటిని ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఉద్యానశాఖ కమిషనర్ శ్రీనివాసులు ఆదేశించారు. శుక్రవారం విజయవాడ నుంచి ఏపీఎంఐపీ అడిషినల్ డైరెక్టర్ ఎం.వెంకటేశ్వర్లుతో కలసి జిల్లా పీడీ బి.రఘునాథరెడ్డి, ఏపీడీ ధనుంజయ, డ్రిప్ కంపెనీ ప్రతినిధులతో వర్చువల్‌గా ఆయన సమీక్షించారు. గతేడాదికి సంబంధించి మెటీరియల్ సరఫరా, ఇన్‌స్టాలేషన్, తుది పరిశీలన ప్రక్రియ వంద శాతం నెలాఖరులోపు పూర్తి కావాలన్నారు. ఆగస్టు నుంచి ఈ ఏడాదికి సంబంధించి పూర్తిస్థాయిలో డ్రిప్, స్ప్రింక్లర్ల పంపిణీపై దృష్టి పెట్టాలన్నారు. గడువులోపు 18 వేల హెక్టార్లకు రాయితీ డ్రిప్ పరికరాలు రైతులకు అందించాలని ఆదేశించారు. అవసరమైతే అదనపు కేటాయింపులు ఇస్తామన్నారు. ఇప్పటి వరకు 2,200 హెక్టార్లకు పరికరాలు అందించారని, వేగవంతం చేయాలని ఆదేశించారు. పరికరాల నాణ్యత విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

విద్యార్థులకు త్రుటిలో తప్పిన ప్రమాదం



విడపనకల్లు: మండలంలోని పాల్తూరు వద్ద ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కకు ఒరిగింది. ఉరవకొండలోని ఉషోదయ స్కూలుకు చెందిన బస్సు శుక్రవారం పాల్తూరు నుంచి విద్యార్థులను ఎక్కించుకుని వెళుతుండగా గ్రామ శివారున ఎదురుగా వచ్చిన టిప్పర్‌ను తప్పించే క్రమంలో అదుపు తప్పి, రోడ్డు పక్కకు ఒరిగింది. ఎవరూ గాయపడ లేదు.

తమ్ముళ్ల దౌర్జన్యం




తాము చెప్పిన తీర్మానాలకే సంతకాలు చేయాలంటూ దౌర్జన్యం చేస్తున్న తెలుగు తమ్ముళ్లు, ఎంపీపీతో వాగ్వాదానికి దిగిన దృశ్యం

- మండల మీట్‌లో రభస
- నిధులన్నీ తమకే ఇవ్వాలని డిమాండ్
- అధికార పార్టీ నాయకులకు ఎంపీడీఓ వత్తాసు
- అర్ధంతరంగా ముగిసిన సమావేశం

ఆత్మకూరు: మండల సర్వసభ్య సమావేశంలో టీడీపీ నాయకులు దౌర్జన్యానికి దిగారు. సమావేశం జరగకుండా అడ్డుకుని రభస చేశారు. ఎంపీపీతో వాగ్వాదానికి దిగారు. అడ్డుకోవాల్సిన అధికారులు సైతం టీడీపీ నాయకులకు వత్తాసు పలికారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కేవలం ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరు కావాల్సిన సమావేశానికి మండలంలోని టీడీపీ నేతలు వచ్చి సమావేశాన్ని అడ్డుకున్నారు. తాము చెప్పిందే చేయాలి అంటూ సమావేశంలో రచ్చ.. రచ్చ చేశారు. సమస్యలపై చర్చిస్తున్న సమయంలో సమావేశం ఆపాలంటూ దౌర్జన్యం చేశారు. ఎన్‌ఆర్‌జీఎస్ పనులను సంబంధించిన నిధులు మొత్తం తమకే ఇవ్వాలని.. తాము చెప్పిన విధంగా తీర్మానాలపై సంతకాలు చేయాలని హంగామా చేశారు. తాము చెప్పిన వారికే పనులు ఇవ్వాలంటూ దురుసుగా ప్రవర్తించారు. సమస్యలపై చర్చించాల్సిన సమయంలో అధికార పార్టీ నేతలు ఇలా వచ్చి అడ్డుకోవడంపై అటు అధికారులు, ఇటు ప్రజా ప్రతినిధులు అసహనం వ్యక్తం చేశారు.

ఎంపీపీతో వాగ్వాదం..

ఒక బీసీ మహిళ (కురుబ సామాజిక వర్గం) ఎంపీపీ కావడంతో టీడీపీ నేతలు ఓర్వలేకపోతున్నారు. సమావేశం జరిగే సమయంలో లోపలికి ప్రవేశించి ఎంపీపీపై దుర్భాషలాడారు. పోలీసులు ఉన్నప్పటికి వారిని లెక్కజేయకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు పనులు చేస్తే బిల్లులు పెట్టం.. వారు పనులు చేస్తే బిల్లులు కూడా కానివ్వం అని టీడీపీ నేతలు బహిరంగంగా చెప్పడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. సమస్యలు, అభివృద్ధి పనులపై చర్చ జరగకుండా సమావేశం అర్ధంతరంగా ముగిసింది.

అధికార పార్టీ నేతలకు రాచ మర్యాదలు

సమావేశం జరిగే సమయంలో టీడీపీ నేతలు వాగ్వాదానికి దిగినప్పుడు ఒక ప్రభుత్వ అధికారి అయిన ఎంపీడీఓ ఏకపక్షంగా వ్యవహరించారు. సమావేశంలో టీడీపీ నేతలకు వత్తాసు పలుకుతూ వారికే మద్దతు ఇస్తూ మాట్లాడారు. అంతేకాకుండా ఎంపీడీఓ, ఎంపీపీ ఒకరికొకరు వాదించుకునే సమయంలో టీడీపీ నేతలు చప్పట్లు కొడుతూ ఎంపీడీఓను ప్రోత్సహించారు. సమావేశం ముగిసిన అనంతరం సర్పంచులు, ఎంపీటీసీలు ఎంపీపీ చాంబర్‌లో కూర్చొని గ్రామాల అభివృద్ధిపై చర్చించారు. అయితే ఎంపీడీఓ కార్యాలయంలో పని చేస్తున్న ఏఓ మాత్రం ఎంపీటీసీలు, సర్పంచులు ఏదైనా సమావేశాలు పెట్టుకోవాలి అనుకుంటే తమ ఇళ్ల దగ్గర పెట్టుకోవాలంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే సమయంలో ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ చాంబర్‌లో మాత్రం అధికార పార్టీ నేతలకు ఎంపీడీఓ టీ, కాఫీలు ఇచ్చి మరీ గౌరవిస్తూ ప్రజా ప్రతినిధులను అవమానించారు.

టీడీపీ నాయకుల ప్రవర్తన హేయం



మాట్లాడుతున్న ఎంపీపీల సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు సుబ్బర హేమలత

ఆత్మకూరు: తాము చెప్పిన పనులకు సంబంధించిన తీర్మానాలపై సంతకాలు చేయలేదన్న కారణంతో టీడీపీ నేతలు తమకు ఇష్టం వచ్చినట్లు మాట్లాడారని ఎంపీపీల సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు సుబ్బర హేమలత అసహనం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశం అనంతరం ఆమె తన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. మండల నిధులకు సంబంధించి తాము తెచ్చిన తీర్మానాలపై సంతకాలు చేయాలని.. లేదంటే ఇబ్బంది పెడుతామని టీడీపీ నాయకులు బహిరంగంగా చెప్పడం దుర్మార్గమన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు పనులు చేస్తే వాటికి బిల్లులు కూడా పెట్టమని అందరి ముందే చెప్పడం విడ్డూరంగా ఉందని తెలిపారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఎస్సీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి స్థలం కేటాయించగా.. ప్రస్తుతం ఎస్సీ కమ్యూనిటీ భవనం నిర్మాణానికి సంబంధించిన తీర్మానాన్ని ప్రవేశపెట్టనివ్వకుండా టీడీపీ నేతలు అడ్డుకుంటున్నారన్నారు. ఎస్సీలపై ఇంత వివక్ష ఎందుకని ప్రశ్నించారు. తాగునీటి సమస్య పరిష్కారానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలానికి పీఏబీఆర్ డ్యాం ద్వారా పైప్‌లైన్ పనులకు రూ.90 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఆత్మకూరుకు రూ.60 కోట్లు కేటాయించారన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలోనే 80 శాతం పనులు పూర్తయినట్లు గుర్తు చేశారు. మిగిలిన 20 శాతం పనులు టీడీపీ అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ప్రజలు ప్రభుత్వానికి మధ్య వారధిలా పని చేయాల్సిన ఎంపీడీఓ ఏకపక్షంగా టీడీపీ నేతలకు వత్తాసు పలుకుతూ మాట్లాడారన్నారు. ఎలాగైన తాము చెప్పిన వారికి, తాము చేసే పనులకు సంతకాలు చేయించేందుకు ఆ ఎంపీడీఓను రాప్తాడు నుంచి ఆత్మకూరుకు రప్పించారని మండిపడ్డారు. ఎంపీడీఓ తీరు, టీడీపీ నేతలపై త్వరలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు విజయ్ కుమార్ నాయక్, నీలిమ, సర్పంచులు వరలక్ష్మి, చంద్రోశేఖర్, ఉజ్జినప్ప, రేణుకమ్మ, ఎంపీటీసీలు పోతులయ్య నాయకులు వన్నూరప్ప తదితరులు పాల్గొన్నారు.

మోసం చేయడంలో చంద్రబాబు దిట్ట



మాట్లాడుతున్న మేయర్ వసీం, చిత్రంలో అనంత చంద్రారెడ్డి

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పిలుపు మేరకు బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం జిల్లా కేంద్రంలో జోరుగా సాగుతోంది. శుక్రవారం మేయర్ వసీం, సీనియర్ పార్టీ నేత అనంత చంద్రారెడ్డి ఆధ్వర్యంలో నగరంలోని 5, 10వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు వివరించారు. గత ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందించిన విప్లవాత్మక సంస్కరణలను గుర్తు చేశారు. అమ్మఒడి, రైతు భరోసా, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగుల ద్వారా ఇంటి వద్దకే సంక్షేమాన్ని అందించిన విషయాన్ని గుర్తు చేశారు. సీఎం చంద్రబాబు ష్యూరిటీ ఇస్తారని.. మోసం మాత్రం గ్యారంటీగా చేస్తారన్నారు. 5వ డివిజన్‌లో రూ.2.21 కోట్లు, 10 డివిజన్‌లో రూ.1.5 కోట్ల అభివృద్ధి పనులు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాగజ్‌ఘర్ రిజ్వాన్, అనుబంధ సంఘాల అధ్యక్షులు సాకే చంద్ర, అమర్‌నాథ్‌రెడ్డి, చింతా సోమశేఖర్ రెడ్డి, కార్పొరేటర్లు జయలలిత, దేవి, లక్ష్మి, సుమతి, తదితరులు పాల్గొన్నారు.

4వ డివిజన్‌లో..

4వ డివిజన్‌లో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి ఇంటింటికీ తిరిగారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను వివరించారు. ఎన్నికలకు ముందు అలివిగాని హామీలు ఇచ్చిన చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, నారా లోకేష్ అధికారంలోకి వచ్చాక మాట తప్పారన్నారు. డైవర్షన్ పాలిటిక్స్‌తో ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. అక్రమ అరెస్టులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారన్నారు. జగనన్న పాలనలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముందుకెళ్లారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ప్రీతంరెడ్డి, రవికుమార్, అవైజ్ హజీరి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యలో నూతన సంస్కరణలు



మాట్లాడుతున్న ఆర్‌ఐఓ వెంకటరమణ నాయక్

అనంతపురం ఎడ్యుకేషన్: ఇంటర్ విద్యలో ఈ విద్యా సంవత్సరం కొత్తగా తీసుకొచ్చిన సంస్కరణలపై శుక్రవారం అన్ని యాజమాన్యాల కళాశాలల ప్రిన్సిపాళ్లకు ఆర్‌ఐఓ వెంకటరమణ నాయక్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. సిలబస్ మార్పు, సబ్జెక్టు కలయిక (కాంబినేషన్), ప్రశ్నపత్రంలో మార్పులను వివరించారు. ఇంటర్ చదివే విద్యార్థులు ప్రధానంగా ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈఓ, హెచ్‌ఈసీ గ్రూపులు తీసుకుంటారన్నారు. ఈ గ్రూప్ సబ్జెక్టులతో పాటు పార్ట్–1గా ఇంగ్లిష్‌ను, పార్ట్–2లో ద్వితీయ భాషగా తెలుగు, సంస్కృతం, ఉర్దూ, అరబిక్, తమిళ్, కన్నడ, ఒరియా, పర్షియన్, ఫ్రెంచ్ లేదా ప్రధాన సబ్జెక్టులైన మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, హిస్టరీ, ఎకనామిక్స్, కెమిస్ట్రీ, సివిక్స్ లేదా మైనర్ సబ్జెక్టులైన జియోగ్రఫీ, లాజిక్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, మోడర్న్ లాంగ్వేజ్ ఇంగ్లిష్, తెలుగు, ఉర్దూలో ఒక సబ్జెక్టును ఎంపిక చేసుకోవచ్చని ఆర్‌ఐఓ తెలిపారు. ఎంపీసీ విద్యార్థులు అడిషనల్‌గా (6వ సబ్జెక్టుగా) ఆప్షనల్ సబ్జెక్టు బయాలజీ, బైపీసీ విద్యార్థులు అడిషనల్‌గా (6వ సబ్జెక్టుగా) ఆప్షనల్ సబ్జెక్టు మ్యాథ్స్‌ను ఎంపిక చేసుకోవచ్చన్నారు. ఈ అడిషనల్ సబ్జెక్టును విద్యార్థులు సొంతంగా చదువుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. మ్యాథ్స్–ఏ, మ్యాథ్స్–బీ సబ్జెక్టులను విలీనం చేసి మ్యాథ్స్ సబ్జెక్టుగా, బాటనీ, బయాలజీ సబ్జెక్టులను విలీనం చేసి బయాలజీ సబ్జెక్టుగా ఈ ఏడాది మొదటి సంవత్సరం విద్యార్థులకు అమలు చేస్తారన్నారు. ద్వితీయ సంవత్సరంలో గ్రూప్‌లలో కానీ, సబ్జెక్టుల విలీనం కానీ, ప్రశ్నపత్రంలో మార్పులు కానీ చోటు చేసుకోలేదన్నారు. 2026–27 విద్యా సంవత్సరంలో ద్వితీయ సంవత్సరంలోనూ మార్పులు ఉంటాయన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఏవైనా అనుమానాలుంటే నివృత్తి చేసుకోవటానికి సంబధిత కళాశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని సూచించారు.

‘అనంతలక్ష్మి’లో కొలువుల పంట



విజయ సంకేతం చూపుతున్న విద్యార్థులు

అనంతపురం: అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరంలో 489 మంది విద్యార్థులకు కొలువులు దక్కినట్లు చైర్మన్ ఎం.అనంత రాముడు తెలిపారు. క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు గురువారం అభినందన సభ ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎంఆర్‌ఎఫ్‌లో 96, సుదర్ ల్యాండ్ కంపెనీలో 49, ఇన్ఫోసిస్–7, జెన్‌ట్రీ ల్యాబ్స్–4, పీఐఈ ఇన్ఫోటెక్–30, 24/7 ఏఐ కంపెనీలో–8, ఎంసీ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్–7, పెంటగాన్ స్పేస్–19, బ్లూస్టార్–1, ష్నైడర్ ఎలక్ట్రిక్–58, ఇంటర్నెజ్ వ్యాలీ–10, మెయిన్ ఈసీ–120, టీచ్‌నుక్–36, స్కిల్ ఇంటెర్న్–25, రైనెక్స్–5, కోరిజో–3 కంపెనీల్లో కొలువులు దక్కినట్లు పేర్కొన్నారు. క్యాంపస్ ఇంటర్వ్యూల్లో కంపెనీల వ్యూహాలకు తగ్గట్టుగా ప్రత్యేక శిక్షణ ఉచితంగా అందిస్తున్నామని పేర్కొన్నారు. అర్థమేటిక్, రీజనింగ్, మేథమేటిక్స్, ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంపొందించేలా విద్యార్థులకు శిక్షణ ఇవ్వడంతో ఉద్యోగాలు వచ్చాయని తెలిపారు. సాంకేతిక రంగంలో వస్తున్న నూతన మార్పులకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దడమే ధ్యేయమన్నారు. కార్యక్రమంలో అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాల వైస్ చైర్మన్ ఎం.రమేష్ నాయుడు, స్కిల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ సురేంద్ర నాయుడు పాల్గొన్నారు.

రస్తా సమస్యకు పరిష్కారం చూపండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎం.బండమీదపల్లి రైతులు

రాప్తాడు: పూర్వ కాలం నుంచి వెళ్తున్న రస్తా (బండి జాడ)ను బంద్ చేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. రస్తా సమస్యను శాశ్వతంగా పరిష్కారించాలని ఎం.బండమీదపల్లి రైతులు శుక్రవారం తహసీల్దార్ విజయకుమారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మాధవయ్య, రైతులు పరంధమ, కేశవయ్య, కాటమయ్య, ఫక్కీరప్ప, అక్కులప్ప, చిన్న ఉజ్జన్న తదితరులు మాట్లాడారు. ఎం.బండమీదపల్లి గ్రామానికి చెందిన 31 మంది రైతులకు సర్వే నెంబర్ 239-2, 241-1, 186, 187, 185, 239-1సి, 249, 240లో భూములు ఉన్నాయన్నారు. ఆ భూములకు సంబంధించి రస్తా (బండి జాడ) పూర్వ కాలం నుంచి అదే గ్రామానికి చెందిన మారక వెంకట రామిరెడ్డి (సర్వే నంబర్ 238–2లో) పొలం మీదుగా ఉందని తెలిపారు. ప్రస్తుతం మారక వెంకట రామిరెడ్డి ఇతర రైతులు పొలాలకు వెళ్లకుండా అతడి పొలంలో జేసీబీతో కాలువ తవ్వించి మట్టిని అడ్డుగా వేయించినట్లు పేర్కొన్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రతి పొలానికి రస్తా ఉంటుందని, రస్తా లేని భూములు ఉండవన్నారు. సంబంధిత రైతును పిలిపించుకుని రస్తా సమస్యను రెండు రోజుల్లో పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతులు లక్ష్మన్న, మల్లికార్జున, సంజీవులు, బోడమల్లు, సంగప్ప, ప్రసాద్, చిన్నారప్ప, హేమచంద్ర, వెంకటేశులు, చంద్రశేఖర్, సుబ్బరాయుడు, సల్లప్ప, కుళ్లాయప్ప, నాగరాజు, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

గౌతు లచ్చన్న జయంతిని ప్రభుత్వమే నిర్వహించాలి

అనంతపురం ఎడ్యుకేషన్: స్వాతంత్ర్య సమరయోధుడు, క్విట్ ఇండియా ఉద్యమంలో జైలు జీవితం గడిపిన మహోన్నతమైన వ్యక్తి సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఈడిగ, గీత కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని ఈడిగ సంఘం కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ..సర్దార్ గౌతు లచ్చన్న జయంతి ఆగస్టు 16న ఉంటుందన్నారు. అప్పట్లో కల్లు మత్తు పానీయంగా గుర్తించి జీఓ అమలు చేయగా ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ అవిశ్వాస తీర్మానం పెట్టి ప్రభుత్వాన్ని కూలదోచిన వ్యక్తి గౌతు లచ్చన్న అన్నారు. చిన్న వయస్సులోనే శ్రీకాకుళం నుంచి మద్రాస్ వరకు పాదయాత్ర చేశారని గుర్తు చేశారు. సమావేశంలో వేణుగోపాల్, నాగభూషణ, లాలప్ప, సూరిబాబు, తుమ్మల నారాయణ స్వామి, శ్రీరాములు, ప్రసాద్, జగదీష్ పాల్గొన్నారు.

ఎస్పీని ఆశ్రయించిన ప్రేమజంట



మాట్లాడుతున్న ప్రేమికులు

అనంతపురం: ‘మేము ఇష్టపూర్వకంగా పెళ్లి చేసుకున్నాం. రక్షణ కల్పించి స్వస్థలాలకు చేరుకునేలా చర్యలు తీసుకోవాలి’ అని ఓ ప్రేమజంట శుక్రవారం ఎస్పీ జగదీష్‌ను కలసి కోరింది. వివరాలు ఇలా.. ఉరవకొండ నియోజకవర్గం విడపనకల్లు మండలం మల్లాపురం గ్రామానికి చెందిన గోవిందు, వన్నూరమ్మ దంపతుల కుమార్తె హెచ్.గౌతమి, పాల్తూరు గ్రామానికి చెందిన శివప్ప, సుంకలమ్మ కుమారుడు ఎం.ఎర్రిస్వామి ఏడాదిన్నరగా ప్రేమించుకుంటున్నారు. ఎవరి ప్రమేయం లేకుండా ఇష్టపూర్వకంగా పెళ్లి చేసుకున్నారు. పెద్దలు పెళ్లికి అంగీకరించక పోవడంతో పెళ్లి చేసుకున్నారు. ఇద్దరూ మేజర్లు కావడంతో రక్షణ కల్పించాలని పోలీసులను కోరుతున్నారు.



నారుకు చీరలే రక్షణ..

మిడ్‌పెన్నార్ డ్యామ్ కింద వరి సాగుకు రైతులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. నారు మడుల్లోకి కొంగలు దూరకుండా రైతులు వినూత్నంగా ఆలోచించారు. మడుల చుట్టూ చీరలు కట్టి వరినారును ఇలా రక్షించుకుంటున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:

నకిలీ ధ్రువపత్రాలపై విచారణ చేయాలి

అనంతపురం అర్బన్: డీఎస్సీలో నకిలీ టీపీఈడీ సర్టిఫికెట్ సమర్పించిన వారిపై విచారణ చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సంతోష్ కుమార్, వ్యాయామ విద్య పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మోహన్‌గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ఏఐవైఎఫ్, వీపీపీఎస్ ఆధ్వర్యంలో నాయకులు నిరసన తెలిపారు. అనంతరం ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, ధనుంజయ, బాబ్జి, రమేష్, నాగభూషణం, మధుసాయి, తదితరులు పాల్గొన్నారు.

శ్రావణ లక్ష్మీ నమోస్తుతే..



అలంకరణలో నిముషాంబ దేవి

అనంతపురం కల్చరల్: శ్రావణమాసం తొలి రోజు శుక్రవారం కావడంతో నగరంలోని అమ్మవారి ఆలయాలు కిటకిటలాడాయి. వాడవాడలా అమ్మవారి ఆలయాల్లో సామూహిక కుంకుమార్చనలు, అభిషేకాలు, అలంకార సేవలు జరిగాయి. భక్తులు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

క్లుప్తంగా

24 మందికి ఎస్‌ఐలుగా పదోన్నతి



ఎస్పీ జగదీష్‌కు కృతజ్ఞతలు చెబుతున్న ఎస్‌ఐగా పదోన్నతి పొందిన వారు

అనంతపురం: ఏఎస్‌ఐ నుంచి ఎస్‌ఐలుగా పదోన్నతులు కల్పించాం. మెరుగైన సేవలు అందించాలని జిల్లా ఎస్పీ పి.జగదీష్ కోరారు. అనంతపురం జిల్లాలో పని చేస్తున్న 1990 బ్యాచ్‌కు చెందిన 24 మంది ఏఎస్‌ఐలకు ఎస్‌ఐలుగా పదోన్నతి కల్పించారు. జిల్లా పోలీసు అధికారుల సంఘం ప్రతినిధులుతో కలిసి పదోన్నతి పొందిన ఎస్‌ఐలు శుక్రవారం ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా పోలీసు అధికారుల సంఘం అడ్‌హాక్ కమిటీ సభ్యుడు, ఎస్‌ఐగా పదోన్నతి పొందిన సాకే త్రిలోక్‌నాథ్ జిల్లా ఎస్పీకి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలియజేశారు. సత్వరమే పదోన్నతులు ఇవ్వడంలో జిల్లా ఎస్పీ తీసుకున్న చొరవపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పదోన్నతి పొందిన ఎస్‌ఐలతో జిల్లా పోలీసు అధికారుల సంఘం అడ్‌హాక్ కమిటీ సభ్యులు సుధాకర్ రెడ్డి, శ్రీనివాసులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

31న సీపీఐ నియోజకవర్గ మహాసభ

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం కందుకూరులో ఈనెల 31న జరిగే సీపీఐ రాప్తాడు నియోజకవర్గ మహాసభను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా సహాయకార్యదర్శి చిరుతల మల్లికార్జున పిలుపునిచ్చారు. శుక్రవారం నగరలలోని సీపీఐ కార్యాలయంలో రాప్తాడు నియోజకవర్గ నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చిరుతల మల్లికార్జున మాట్లాడుతూ.. మహాసభకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు. సమావేశంలో సీపీఐ రాప్తాడు నియోజవర్గ కార్యదర్శి రామకృష్ణ, సహాయ కార్యదర్శి శ్రీకాంత్, అనంతపురం మండల కార్యదర్శి రమేష్, రామకృష్ణ, రవి, సహాయ కార్యదర్శులు నరేష్, శివ, చలపతి, ఏఐవైఎఫ్ నాయకులు ధనుజయ, రాము, శాఖా కార్యదర్శులు అక్కులన్న, రెడ్డప్ప, నరసింహులు, గోవిందు, ఆదెప్ప తదితరులు పాల్గొన్నారు.

స.హ చట్టంపై అవగాహన తప్పనిసరి



స.హ చట్టం కరపత్రాలు ప్రదర్శిస్తున్న పట్టుపరిశ్రమ శాఖ డీఎస్‌ఓ, ఇతర ఉద్యోగులు

అనంతపురం అగ్రికల్చర్: పట్టుపరిశ్రమ శాఖ ఉద్యోగులకు శుక్రవారం సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించారు. స్థానిక పట్టుశాఖ కార్యాలయంలో ఆ శాఖ జిల్లా అధికారి ఐ.విజయ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి సమాచార హక్కు పరిరక్షణ సంఘం ప్రతినిధి హొన్నూరప్ప హాజరై చట్టం గురించి తెలియజేశారు. ప్రధానంగా ఉద్యోగుల్లో జవాబుదారితనం, పథకాల అమలులో పారదర్శకత, అవినీతి నిర్మూలనకు దోహదం చేస్తుందన్నారు. ఈ చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు.

నకిలీ డాక్యుమెంట్లతో మహిళకు టోకరా

బుక్కరాయసముద్రం: నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి ఓ మహిళకు ఆ స్థలాన్ని విక్రయించిన ఘటన బీకేఎస్ మండలంలోని గోవిందపల్లి పంచాయతీలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. అనంతపురం వినాయకనగర్‌కు చెందిన నాగరత్నమ్మ తాడిపత్రి మండలం చిన్న పొలమాడ గ్రామానికి చెందిన చొక్కా రాము నుంచి గోవిందపల్లి పంచాయతీలోని బీజేపీ కాలనీ సమీపంలో సర్వే నెంబర్ 295లో 7.16 సెంట్లు 2021లో రూ. 21 లక్షలకు కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అయితే హద్దులు చూపించాలని రామును పలుమార్లు నాగరత్నమ్మ అడిగినా వాయిదా వేస్తూ వచ్చాడు. దీంతో నాగరత్నమ్మ బండలు పాతుకోవాలని స్థలం వద్దకు వెలితే అక్కడ కొంత మంది వ్యక్తులు సర్వే నెంబరు, ప్లాటు నెంబర్లు తప్పుగా ఉన్నాయని, ఈ ప్లాటు వేరే వారి పేరున ఉందని వివరించారు. దీంతో బాధిత మహిళ రాముకు ఫోన్ ద్వారా సంప్రదించగా అతను సరిగా స్పందించక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం: న్యాయశాఖలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని భారత న్యాయవాదుల సంఘం (ఐఏఎల్) డిమాండ్ చేసింది. రాష్ట్రవ్యాప్త ఆందోళనల్లో భాగంగా అనంతపురం జిల్లా కోర్టు గేటు ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఏఎల్ రాష్ట్ర నాయకులు ఐదుకల్లు రవీంద్రనాథ్ , జిల్లా అధ్యక్షుడు అబ్దుల్‌రసూల్, జాతీయ కార్యవర్గ సభ్యులు జే.రాజారెడ్డి మాట్లాడారు. న్యాయవాదుల పరిరక్షణ చట్టం చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కోర్టు ప్రాంగణంలో మహిళా విశ్రాంతి హాల్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

300 కిలోల ప్లాస్టిక్ స్వాధీనం



జరిమానా విధిస్తున్న నగరపాలక సిబ్బంది

అనంతపురం కార్పొరేషన్: కమిషనర్ బాలస్వామి ఆదేశాలతో నగరంలోని రాజు రోడ్డు, తిలక్ రోడ్డులోని 12 హోల్‌సేల్ ప్లాస్టిక్ షాపులపై నగరపాలక సంస్థ అధికారులు 12 బృందాలుగా ఏర్పడి శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. సేట్ల షాపుల్లోని అనధికారికంగా ఉన్న 300 కిలోల సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను సీజ్ చేశారు. అనంతరం ప్లాస్టిక్‌ను నగరపాలక సంస్థకు తరలించారు. దీంతో సేట్లు పెద్ద ఎత్తున నగరపాలక సంస్థకు చేరుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్ విక్రయిస్తున్న 12 షాపులపై రూ.1,66,000 జరిమానా విధించారు.

కార్మికులకు చీరల పంపిణీ

అనంతపురం కల్చరల్: నిత్యసురభి చారిటబుల్ ట్రస్టు, పుట్టినిల్లు ఆశ్రమం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో పని చేస్తున్న 25 మంది శానిటరీ కార్మికులకు చీరలు, పసుపు, కుంకుమలతో పాటూ ఇతర వాయన సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్‌పర్సన్ డాక్టర్ నిర్మల మురళీ, డిప్యూటీ సూపరింటెండెంట్ బెనాడిక్ట్, డాక్టర్ హేమలత, ట్రస్టు సభ్యులు సురేష్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

దాడులపై ఎమ్మెల్యేలు మాట్లాడరా?



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అనంతపురం కార్పొరేషన్: ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడులు, అన్యాయాలపై మాట్లాడితే మీ ఎమ్మెల్యే పదవులు పోతాయా? అని టీడీపీ ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజు, బండారు శ్రావణిని వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రశ్నించారు. శుక్రవారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం కారణంగానే ఎస్సీ రిజర్వేషన్‌లో వారిద్దరూ ఎమ్మెల్యేలు అయ్యారన్న విషయాన్ని మరువకూడదన్నారు. శ్రీ సత్యసాయి జిల్లాలో దళిత మైనర్ బాలికపై సామూహిక అత్యాచారం, అనంతపురంలో ఎస్టీ యువతి హత్యను ఎమ్మెల్యేలు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ నాయకులు నాగరాజు నాయక్, సాకే శ్రీనివాసులు, సాకే చిరంజీవి, యువజన విభాగం దాదాఖలందర్, శ్రీనివాసదత్తా పాల్గొన్నారు.

పోక్సో కేసు నమోదు

గుత్తి: ఓ మైనర్ బాలికను ప్రేమించాలని వేధిస్తుండటంతో పాటు బాలిక తల్లిదండ్రులు చంపుతానని బెదిరించిన మధుసూదన్ అనే వ్యక్తిపై పోలీసులు శుక్రవారం రాత్రి పోక్సో కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని తురకపల్లికి చెందిన మధుసూదన్ గత కొంత కాలంగా గుత్తి ఆర్ఎస్‌కు చెందిన బాలికను ప్రేమించాలని వేధిస్తున్నాడు. వేధింపులు అధికం కావడంతో బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారించిన ఎస్‌ఐ సురేష్ నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వామ్మో.. చిరుత

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి పంచాయతీ బీఎస్‌ఆర్ కాలనీ సమీపంలో శుక్రవారం రాత్రి చిరుత సంచారం స్థానికుల్లో కలకలం రేపింది. రాత్రి 8 గంటల సమయంలో కొందరు యువకులు బహిర్భూమికి వెళ్లారు. బీఎస్‌ఆర్ కాలనీ–సదాశివ కాలనీల మధ్య చెట్ల పొదల్లో చిరుతను గుర్తించి పరుగులు తీశారు. వెంటనే ఆయా కాలనీల వారికి సమాచారం అందించడంతో గుంపులు గుంపులుగా అక్కడికి చేరుకున్నారు. కొందరు గట్టిగా కేకలు వేస్తూ శబ్ధాలు చేయడంతో చెట్ల పొదల్లో నుంచి పరుగులు తీస్తూ చెక్‌డ్యాం వైపు వెళ్లిపోయింది. ఈ సమయంలో కొందరు మొబైల్లో వీడియోలు తీశారు. బాగా చీకటిగా ఉండడంతో రెప్పపాటులో చిరుత వెళ్లిపోవడం రికార్డ్ అయింది. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. సమాచారం అందుకున్న రూరల్ పీఎస్ సీఐ శేఖర్, ఎస్‌ఐ రాంబాబు, సిబ్బంది హుటాహుటిన ఆ ప్రాంతానికి చేరుకున్నారు. సమీప ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. శివారు కాలనీల ప్రజలు రాత్రిపూట అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. కాగా.. నాలుగు రోజుల క్రితం నరసనాయనికుంట గ్రామ శివారులో ఓ చిరుత సంచరించిందని గ్రామస్తులు తెలిపారు. నాలుగు కుక్కలపై దాడి చేసి హతమార్చడం భయాందోళన కలిగిస్తోంది. అదే చిరుత బీఎస్‌ఆర్ కాలనీ సమీపంలో సంచరించి ఉంటుందనే అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

చెన్నేకొత్తపల్లి: మండల వ్యాప్తంగా ఉన్న ఐదు విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎస్ఎస్ గేట్ విద్యుత్‌శాఖ ఏఈ రామాంజనేయులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మెయిన్ సప్లయ్‌లో మరమ్మతుల కారణంగా మండల వ్యాప్తంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని సూచించారు.